# నిర్ణయం

'రామయ్యన్నా' అని చిన్నగా పిలిచి తలుపు చప్పుడు చేసేడు కృష్ణమూర్తి. ఎవరూ వచ్చి తలుపు తియ్యలేదు. వినబడలేదేమోనని మరి కొంచెం బలంగా తలుపు తట్టేడు.

ఎక్కడో లోపల వసారాలోనుంచీ 'భానూ, భానూ... ఆ బాసిగాడో ఎవడో వచ్చినట్టున్నాడు. తలుపు తియ్... ఇంతలోనే వెయ్యకపోతేనేం?' అంటూ కేకలేశాడు రామనాథం విసుగ్గా.

"ఎవరో నేను వెళ్లి చూస్తాను... మీరు ఖంగారుపడకుండా పడుకోండి... ఈ పల్లెకొంపకు వచ్చినప్పటి నుండీ తలుపులు వెయ్యనూ తియ్యనూ సరిపోతుంది... ఏం గోలో, ఏమో! ఇక్కడి మనుష్యులకి ఒక టైమనీ ఏమీ వుండదు" అని మాట్లాడుకుంటూనే వచ్చి తలుపు తీసింది భానుమతి.

వచ్చిన మనిషిని చూసి ఒక క్షణం మాట్లాడకుండా నిలబడిపోయింది. ముఖం విసుగుతో ముడుచుకుపోయింది. లేని నవ్వు తెచ్చి పెట్టుకుంటూ "రా, లోపలికి" అన్నది.

కృష్ణమూర్తి లోనికి వచ్చి బురద పేరుకుపోయిన చెప్పులు తలుపు వారగా విడిచి నిలుచున్నాడు. భానుమతమ్మ బావి ప్రక్కగా చూసి "బాసిగాడు గొడ్ల తోలుకుపోయాడు... ఇంట్లోంచీ కాళ్లు కడుక్కోవడానికి నీళ్లు తెచ్చిస్తానుండు" అన్నది కటువుగా.

కృష్ణమూర్తి ఖంగారుగా "ఎందుకమ్మా, చెంద్రమ్మొదినా, నేను బావిలోంచీ నీళ్లు తోడుకొని కడుక్కుంటానుగా... నీకెందుకూ శ్రమ" అంటూనే బావి దగ్గరకు వెళ్లిపోయాడు.

కిష్టయ్యని చూస్తే అందుకే భానుమతమ్మకి మంట. ఏ కాలంనాడో వొదిలేసిన పేరుతో 'చెంద్రమ్మొదినా' అంటాడు. అలా అనడంలో కిష్టయ్య మడ్డితనమే కాకుండా తనను కించపరచాలన్న ఉద్దేశ్యం కూడా వున్నదని ఆమె అనుమానం. పెళ్లవగానే చంద్రమ్మ అన్న పేరు బాగా లేదని భానుమతిగా మార్చుకున్న విషయం అందరికీ తెలుసు! ఈ కిష్టయ్య మాత్రం పాతపేరును వదలటం లేదు!

"ఈ పల్లెటూరి మరియాదలతో నాకు చచ్చే చావుగా వుందనుకో కిష్టయ్యా... ఒక్కొక్కరూ వేళాపాళా లేకుండా పరామర్శకు వస్తుంటే వాళ్లకు కాళ్లకు నీళ్ల దగ్గర్నుంచీ కాఫీ ఫలహారాలు, భోజనాల వరకూ అమర్చాలి. లేకుంటే ఫలానావిడ మనుషుల్ని పలకరించదని చుట్టుప్రక్కల వూళ్లన్నీ గుప్పుమని పోతాయాయెను... ఆయనకు యీ విషయం పట్టింపుగా వుంది, నాకేమో చావుగా వుంది..." అన్నది.

కృష్ణమూర్తికి తగలాలనే అన్నది. కాని కిష్టయ్య ఆ ఎత్తిపొడుపు పట్టించుకోకుండా బక్కెట్లో తోడిన నీళ్లు ధారాళంగా కాళ్ల మీదకు వొంపుకుంటూ బురద కడుగుతూనే "మీకేమో అలవాటు లేదాయెను... ఈ పల్లెటూళ్లల్లో యింతేనమ్మా!" అన్నాడు అనునయంగా.

భానుమతమ్మకు గడచిన రోజులు జ్ఞప్తికి వచ్చి కళ్లల్లో నీళ్లు తిరిగినై. తన భర్త రామనాథం మంచిపేరు గల గవర్నమెంటు డాక్టరుగా వున్నరోజుల్లో నలుగురు పనివాళ్లు ఇంట్లో నిండుగా తిరుగుతూ వున్నప్పుడు ఈ కిష్టయ్య తాము వుద్యోగరీత్యా వున్న పట్టణాలకు నాలుగుసార్లు వచ్చాడు, 'వూరు చూడటానికి' అంత హోదా గల యింట్లో తిరగడానికి, శుభ్రంగా యిస్త్రీ కవర్లు వేసిన సోఫాదిండ్ల మీద కూర్చోవడానికి సంకోచించి బయట అరుగుల మీదనే యింటి దగ్గరకొచ్చిన రోగుల్తో కబుర్లు చెబుతూ కాలం గడిపేవాడు... ఇప్పుడు భానుమతమ్మ కొడుకు ఢిల్లీలోనూ, కూతురు అమెరికాలోనూ వున్నారు. ఆయన రిటైరవగానే తామిద్దరూ స్వగ్రామానికి రావలసి వచ్చింది. ఇక్కడుండే పల్లెటూరి మొద్దుల్ని, బంధువులనటానికి పనికిరాని వాళ్లని మనుషులుగా మన్నించవలసి వస్తున్నది! కిష్టయ్యకు స్వయంగా కాళ్లకు నీళ్లిచ్చి మర్యాద చెయ్యవలసిన పరిస్థితి వచ్చింది!

హైదరాబాదులో మంచి యిల్లొకటి తీసుకుని అక్కడికే తరలి వెళ్లిపోవాలని అనుకుంటుండగానే, తెచ్చుకున్న సామాన్లు పాకింగ్‌లు విప్పకుండానే యీ పల్లెటూళ్లో ఎనభై ఏళ్ల ముసలి అత్తగారికి జబ్బు చేసి చావడం, మూడు నెల్లు తిరుక్కుండానే రామనాథంగారికి స్ట్రోక్ రావటం జరిగిపోయింది. మనశ్శాంతి వుంటే క్రమంగా కోలుకుంటారని అన్నాడు గుంటూరులో డాక్టరు. 'ఇహ ఎన్నాళ్లకో హైదరాబాదు వెళ్లేది!' అని నిట్టూరుస్తూ లోనికి వెళ్లింది భానుమతమ్మ - కిష్టయ్య కోసం తవ్వెడు బియ్యమూ, గిద్దెడు పప్పూ ఉడకబెట్టడానికి.

ముందు గదిలో తాతలనాటి పెద్ద పట్టెమంచం మీద ఆరంగుళాల మందపు పరుపు మీద పడుకుని వున్నాడు రామనాథయ్య. పై పంచెతో ముఖం తుడుచుకుంటూ వచ్చిన తమ్ముణ్ణి చూసి చిన్నగా నవ్వి 'కూర్చో' అన్నాడు.

దూరంగా వున్న గిలకల కుర్చీని మంచం దగ్గరగా లాగి పై పంచెతో దులిపి, కూర్చున్నాడు కిష్టయ్య. "ఒంట్లో ఎట్లాగుందన్నా?" అన్నాడు అక్కరగా. "గుంటూర్లో డాక్టర్లు మనశ్శాంతి వుండాలన్నారంట గదా... మనసుకి కష్టం కలగాల్సిన పరిస్థితులు నీకెందుకుంటవి?..." అంటూ పెత్తండ్రి కొడుకు రామనాధయ్య ముఖంలోనికి పరిశీలనగా చూశాడు. సమాధానమేమీ రాకపోయేసరికి "ఎప్పుడూ నలుగురు పెద్ద మనుషుల్లో పేరుగా పట్టణాల్లో తిరుగుతుండేవాడివి, ఈ పల్లెటూళ్లో ప్రొద్దుపోవడం లేదేమో... పోనీ, అబ్బాయి దగ్గరకెళ్లి నాలుగు నాళ్లుండి రారాదా... ఈ వూళ్లోకొచ్చి యాడాది కావొస్తున్నది. బయట కాలు పెట్టకపోతివి..." అన్నాడు సానుభూతితో.

తమ్ముడి మాటలు విన్న రామనాధానికి కొంచెం తేరుకున్నట్లయింది. ఏడాది నుండీ తానూ యీ పల్లెటూరి రైతుల్లో ఒకడై, అనామకుడై పోయినట్లు కించపడ్డాడు. కిష్టయ్య రాకతో తాను మళ్లీ ఒక హోదాగల డాక్టర్నని ధైర్యం కలిగింది. "కాస్త ఆరోగ్యం కుదుటపడగానే హైదరాబాదుకు వెళ్లిపోతానురా కిష్టాయ్! నా స్నేహితులు చాలమంది అక్కడే వున్నారు... ఇప్పట్లో అబ్బాయి దగ్గరకెళ్లను. ముందు ఆరోగ్యం కుదుటబడాలి!" అన్నాడు.

కిష్టయ్యకు ఒంటరిగాడైన అన్న మీద ఆప్యాయత పొంగుకొచ్చింది. "ఏమిటోలే అన్నా! అందరూ చదువులు చదువులని ఎగబడటమేగాని బతుకు తీరు గమనించడం లేదు! ఆఖరికి చూస్తే కష్టానికీ, సుఖానికీ దగ్గర లేకుండా ఆ పిల్లలెక్కడో మనమెక్కడో!" అంటూ పుగాకు పాయ తీశాడు. దాన్ని చదును చేసి, నిలువుగా రెండు సగాలుగా చీల్చాడు. ఒక సగం చక్కగా సాఫీ చేసి కాలి మీద పెట్టుకున్నాడు. రెండో సగం సమమైన పొడవులో ముక్కలుగా తుంచి, ఆ ముక్కలన్నీ సాఫీ చేసిన పాయలో పెట్టుకొని తాపీగా, చక్కగా చుట్ట చుట్టాడు.

ఈ ప్రయత్నమంతా కించిత్ తిరస్కారంగా చూస్తూ 'చదువుల సంగతీ, వుద్యోగాల సంగతీ వీడికేం తెలుసు!' అనుకున్నాడు రామనాధయ్య. కిశోర్ ఢిల్లీలో పెద్ద జీతంతో మంచి ఉద్యోగంలో వున్నాడు. శాంతి అమెరికాలో తన భర్తతో పాటుగా ఉద్యోగం చేస్తూ బాగా సంపాదించుకొంటున్నది. ఆ డబ్బూ, సుఖమూ, గొప్పదనమూ లక్షల్లో ఒకరికే అదృష్టవంతులకి దక్కేవి! ఇప్పటికి దగ్గరలేకున్నా, ఎక్కడో వున్న వాళ్లిద్దరూ తన రెండు కళ్లు. ఆశాజ్యోతులు! తన ఆశలన్నీ వాళ్లల్లో ఫలిస్తూ, రూపుదిద్దుకుంటుంటే తాను పొందుతున్న ఆనందం పిచ్చి కిష్టాయ్‌కేం తెలుస్తుంది!

కిష్టయ్య చుట్ట చేతిలో పట్టుకుని గుండ్రంగా త్రిప్పి చూసుకుంటూ "అసలు

నేనొక మాట చెప్పాలనే వచ్చాను... నీవు అన్నీ తెలిసిన వాడివి... అయినా..." అంటూ సాగదీశాడు విషయం.

రామనాథయ్య నవ్వుతూ "అంత సందేహిస్తావేమిట్రా చెప్పు!" అన్నాడు.

కిష్టయ్య కొంచెం ఆలోచించి "అందరూ నానారకాలుగా మాట్లాడుతారు... అవన్నీ నీవు మనసులో పెట్టుకోమాక.... పెద్ది సంగతిగాని, నీ జబ్బు సంగతిగాని ఎవరైనా ఏమైనా చెవిలో వేస్తే పట్టించుకోమాక... ఇక్కడ తలకో వెర్రి మొర్రి ఆలోచన. ఇవన్నీ యిక్కడ మామూలే..." అన్నాడు.

రామనాథయ్యకు వూళ్లో వాళ్లు అనుకుంటున్నారని బాసిగాడు చెప్పిన విషయం జ్ఞాపకం వచ్చింది. ఎనభై ఏళ్లు బ్రతికి చచ్చిపోయిన తల్లి.. ఏకైక పుత్రుడైన తన మీద భ్రమ వలన దయ్యమై పట్టిందనీ, అదే యీ జబ్బుకు కారణమనీ అనుకుంటున్నారట! "ఇంత చదువుకున్న వాడిని... అందులో డాక్టర్ని.... నీవు చెప్పకపోతే జబ్బులు ఎలా వస్తాయో తెలియదనుకున్నావా?" నవ్వుతూ తేల్చేద్దామని ప్రయత్నించిన రామనాథయ్య గొంతులో విసుగు వ్యక్తమైంది.

భానుమతమ్మ వచ్చింది. "అన్నానికి లే" అన్నది కిష్టయ్యతో. "ఇప్పుడెందుకు చేశావమ్మా... ఇంటి దగ్గర చద్దెన్నం తినే వచ్చాను" అన్నాడు. "ఎండన బడి నాలుగు మైళ్లా మీ వూరి నుంచీ నడిచే వచ్చావుగా, లే" అన్నదామె. పై పంచె కుర్చీలో వేసి లేచివెళ్లాడు కిష్టయ్య.

★★★

రామనాథయ్యకు ఒళ్లంతా పీకుతున్నట్లుగానూ, కాళ్లు తిమ్మిరిగానూ అన్పించింది. దిండ్లు సర్దుకొని, కళ్లు మూసుకొని పడుకున్నాడు అస్థిమితంగా. తనకు ఆరోగ్యం సరిగా లేనప్పుడైనా పిల్లలు దగ్గరుండే పరిస్థితి వుంటే బాగుండేదనిపించింది. పల్లెటూరి అమాయకుడైనా కిష్టయ్య అన్న మాటల్లో కొంచెం నిజం వుందనిపించింది. నిజంతో సంబంధం లేని ఆశల్లాగా ఎక్కడో దూరాన ఆ పిల్లలు! అనుకున్నాడు.

ముసలి తల్లి మంచంలో వున్నప్పటి మూలుగు యింకా చెవుల్లో హోరెత్తుతూనే వుంది. కిష్టయ్య మాటలు జ్ఞాపకం వచ్చాయి. దయ్యం, దయ్యం! దయ్యమంటే ఏమిటి? చచ్చిపోక ముందు అమ్మ పడిన బాధా, అప్పటి ఆవిడ మూలుగూ ఆర్నెల్లయ్యాక యిప్పుడూ మనసును వికలం చేస్తున్నదంటే, అదేనా దయ్యం పట్టడం?... నుదుట నిండిన స్వేద బిందువుల్ని వ్రేలితో ప్రోగుచేసి క్రిందికి విసిరేశాడు. ప్రక్కనున్న టవలుతో ముఖం, మెడా తడి లేకుండా తుడుచుకున్నాడు. ఓ ప్రక్క నుండి తుడుస్తూ వుండగానే

మళ్లీ చెమట చుక్కలుగా ఏర్పడుతున్నది. గుండె దడదడలాడుతూ వేగం హెచ్చించు కున్నది. 'జబ్బు అన్నదీ రాకూడదుగాని వచ్చిందంటే అన్నీ బాధలే' అనుకున్నాడు రామనాథం నిస్సహాయంగా.

ఆమె... అమ్మ... ఎనభై ఏళ్ల వయసులో కూడా, ఓపరాని నొప్పి పడుతూ, అంత్య సమయంలో కూడా స్వతఃసిద్ధమైన ఠీవిని పోగొట్టుకోలేదు. దువ్వి ముడివేసిన తెల్లని నైలాన్ దారాల్లాంటి జుట్టు, విశాలమైన నుదురు, ముసలితనంలో మరింత స్ఫుటంగా కన్పిస్తున్న కోటేరులాంటి ముక్కు, వయస్సుతో తెల్లపొరలు క్రమ్మి ఎదుటివాళ్ల మనసుల్లో జంకు కల్గించే పెద్ద కళ్లు, పరీక్షగా చూసే చూపు - వయస్సు మీదపడ్డా ఆమె శక్తి ఏమాత్రం తగ్గలేదు! తాను గుర్తెరిగినప్పటి నుండి ఆ కంచుగంటలాంటి అధికారపూర్వమైన స్వరమూ, మనస్సు లోతుల్లోకి చూసే నిశితమైన చూపూ, నిర్లక్ష్యాన్ని సహింపలేని మానసిక తీవ్రతా - అన్నీ తన మనసులో మాయని ముద్రగా నిలిచిపోయాయి. తన ఎడల ఆమె ప్రేమనే చూపినా ఎందుకో తాను సహజంగా ఆమె దగ్గరగా వెళ్లలేకపోయాడు. ఆ ప్రేమ అరమరికలు లేనిది కాదు - అందుబాటు దూరంలో నిలబెట్టి వుంచేది! ఆపరేషనుకు అనువుకాని వయసులో నోటిలో కాన్సర్ వచ్చి బాధతో వుండ చుట్టుకొనిపోతూ, జంతువులాగా అమానుషమైన గొంతుతో మూలుగుతూ వున్నప్పుడూ ఆమె నిస్సహాయురాలిలాగా కన్పించలేదు! మూడుసార్లు 'నాయనా, నీవు డాక్టరువి. నా బాధ అంతం చేసి తల్లి ఋణం తీర్చుకో' అన్నది - కాదు, ఆజ్ఞాపించింది. మొదట తానా మాటలు పట్టించుకోలేదు. డాక్టరుగా తాను ఎన్ని రూపాల్లో ఎంత బాధను చూడలేదు గనుక! కాని అనంతమైన శక్తికీ, ఠీవికీ మూర్తిగా జ్ఞానం రాని పసితనం నుంచీ తన మనసులో నిలిచి వున్న అమ్మ యిప్పుడు యింత ఘోరంగా మూలగటం, బాధపడటం తన మనసులో ఒక అసామాన్య స్థితిని తెచ్చిపెట్టింది... మార్ఫిన్ మత్తులో వున్న కొద్ది సమయం తప్పించి రాత్రింబవళ్లూ.... నెల రోజులు... ఏడు వందలా ఇరవై గంటలు... నలభై మూడు వేల రెండు వందల నిమిషాలు... ఇరవై ఆరు లక్షల సెకండ్ల కాలం... నిర్విరామంగా ఆ మూలుగును భరించాడు, అనుభవించాడు! పిచ్చెక్కిపోతుందనిపించింది. ఆమె యింత బాధను అనుభవించడం అసంగతంగా తోచింది.

"ఎట్లాగూ పోయే ముసలావిడ ఆ ప్రకారం బాధపడటమెందుకు? చూస్తూ వూరుకుంటారా? ఏమైనా చెయ్యకూడదూ? అంతగా అడుగుతున్నది!" అన్నది భానుమతి. అర్థం కానట్లు వుండిపోయాడు. క్రమంగా ఆ వుద్దేశ్యం బలపడి, నాలుగోసారి అమ్మ కోరినప్పుడు ఆమె మొయ్యలేని మార్ఫిన్ ఇంజక్షన్ యిచ్చాడు ఒణుకుతున్న చేతుల్తో.

వున్నట్లుండి, తీవ్రమైన రెండు ఎండతెరల మధ్యన ఉబ్బవేస్తూ వుండే వాతావరణంలోని అసహజ ప్రశాంతత లాంటిది ఏర్పడింది. బాహ్య ప్రపంచం నుంచీ మూలుగు అస్తమించింది.

ఒక ప్రాణాన్ని అంతం చెయ్యడానికి మరో మనిషికి హక్కు వున్నదా? ఒక హంతకుడికీ తనకూ భేదం వున్నదా?... ఆ మూలుగు తనలో కల్పించిన వైకల్యం నుంచీ తప్పించుకోడానికే అలాంటి నిర్ణయం చేశాడా తాను?.... హార్దికమైన ప్రేమను అందించని తల్లిని చంపాడా?... అనిశ్చిత మానసిక స్థితిలో భార్య చెప్పిన పని చేశాడా?... భార్య తనను గురించి ఏమనుకుంటున్నది?... అది సరైన నిర్ణయం అయితే యిప్పుడీ మథనం ఎందుకు?... 'సరైన నిర్ణయం' ఎట్లా తెలుసుకోవడం?... బాహ్య ప్రపంచం నుంచీ అంతరింపజేసిన మూలుగు అతనికి మనసులో నిండిపోయి వున్నది...

భోజనం చేసి వచ్చాడు కిష్టయ్య తృప్తిగా త్రేనుస్తూ. అన్నను చూసి 'అరె! చెమట కారిపోతున్నదే!' అంటూ ప్రక్కనున్న విసనకర్ర తీసుకుని విసరటం ప్రారంభించాడు. రామనాథయ్యకు చల్లటిగాలి తగిలి కొంచెం తేరుకున్నట్లనిపించింది.

'బోలెడన్ని తత్వాలు పాడతావు, వేదాంత చర్చలు చేస్తావు... కిష్టయ్యా, మనిషి తీసుకునే నిర్ణయాలకు సబబు ఎట్లాంటిదో చెప్పు, చూద్దాం....' అన్నాడు రామనాథయ్య తన ప్రశ్నను సగం నవ్వుతాలుగా ధ్వనింపజేస్తూ.

చొక్కా జేబులోంచీ యిందాక చుట్టిన చుట్ట బయటికి తీశాడు కిష్టయ్య. రెండు అగ్గిపుల్లల సహాయంతో ముట్టించాడు. అన్నను పరిశీలనగా చూసి "అదేమిటన్నాయ్, వేదాంతం మీద దృష్టి మళ్లింది క్రొత్తగా!... నవ్వుతాలుకా?... నిర్ణయాలు తీసుకోడానికి మనమెంతటి వాళ్లం గనక! జరగబోయేది మనకు తెలియదు. జరుగుతున్నదాన్నీ కనుక్కొని చెప్పలేము. ఆలోచనకందేది ఎంత మట్టుకు? అంతా పైవాడి లీల!" అన్నాడు. మెట్ట వేదాంతం! అనుకున్నాడు రామనాథయ్య. "అయితే తప్పూ, ఒప్పూ లేదు. ఏం చేసినా ఫరవాలేదంటున్నావా?" అన్నాడు నవ్వుతూ.

కిష్టయ్య ఆలోచనలో పడ్డాడు. చివరికి "మనస్ఫూర్తిగా చెయ్యాలి.... ఇతరులకి బాధ కలిగించకుండా..." అని ఆగి, "నన్ను బాగా ఆట పట్టించాలనుకున్నావా?" అన్నాడు.

భానుమతమ్మ వచ్చింది. "కిష్టయ్యా! ఆ చుట్ట పొగ రైలు యింజన్‌లాగా వొదుల్తున్నావ్!" అన్నది నొసలు చిట్లించి.

కిష్టయ్య చుట్ట చివర్ని నేల మీద రుద్ది, ఆర్పి, జేబులో వేసుకున్నాడు నవ్వుకుంటూ.

"ఆయనకసలే మనసు బాగుండటం లేదు... మీ పెద్ది నెలరోజులు గోండ్రించి చెవులు హోరెత్తించింది. అదే మనసు పాడు చేసిందంటున్నారు... ఇహ నీ వేదాంతం కాస్త జోడించావంటే బాగానే వుంటుంది!" అన్నది.

"ఆ! కాసేపు వుబుసుపోక..." అన్నాడు రామనాథయ్య. కిష్టయ్య వేపు తిరిగి "చేసేదంతా భగవంతుడేనన్నావ్. అంతలోనే 'మనస్ఫూర్తి', 'యితరులకు బాధ కల్గించడం' అంటున్నావు. అవెవరు నడిపిస్తారు?" ఉత్సాహంగా అన్నాడు కిష్టయ్యను బోల్తాకొట్టించా ననుకుని.

కిష్టయ్య ఇరుకునపడ్డాడు. "అంతా వాడే చేయించేది! మనం చేస్తున్నామనుకుంటే సబబుల కోసం చూస్తాం, అర్థాలు చెప్పుకుంటాం, బాధపడతాం! చేయించేది వాడేనని తెలుసుకుంటే బాధ వుండదు... మనస్ఫూర్తి అంటావా, మనస్సు ప్రశాంతంగా వుండటానికి తత్కాలానికి నిర్ణయం తీసుకుని నడవ్వలసిన దోవ... జగన్నాటకంలో నిర్ణయాలు చేసే ప్రసక్తి కాదు!" అన్నాడు వెనకెప్పుడో ఒక స్వాముల వారు చెప్పగా జీర్ణించుకున్న విషయం జ్ఞాపకం చేసుకుని.

రామనాథయ్య నవ్వాడు. "మనశ్శాంతి, మనస్ఫూర్తి! చాల అద్వైతంగా వుందే! ఇదంతా కనిపెట్టినవాళ్లు మనిషికి బాధ్యతలు చాలా సులువు చేసేశారు!... మేము బాధ్యతలు దేవుడి మీద తోసెయ్యం. ఎంచేతనంటావా... మనం పూనుకోకుండా ఏ పనీ జరగటం లేదిక్కడ! నా యాభై ఆరేళ్ల జీవితంలో ఆ దేవుడు ఎప్పుడూ కన్పించలేదు... నిర్ణయాలకు బాధ్యత తప్పదు!" అన్నాడు దిగులుగా. మాటల్లో ఆయాసం కన్పించింది.

అంతలోనే ఒళ్లంతా లాగేస్తున్నట్లు, గుండె పిండేస్తున్నట్లు బాధ కల్గింది. "పిల్లలు, పిల్లలు" అనుకున్నాడు ఆదుర్దాగా. వాళ్లు రాలేరు! మనసులో నిస్పృహ, నిస్సహాయత నిండిపోయింది. 'నొప్పి, నొప్పి' అంటూ వుండ చుట్టుకుపోయాడు.

"ఎక్కడ? ఎక్కడ?" అంటూ కంగారుపడ్డాడు కిష్టయ్య. "తొందరగా పోయి డాక్టర్ని పిలుచుకురా, అట్లా నిల్చున్నావే!" అంటూ భర్త దగ్గరకు పరుగెత్తుకొచ్చింది భానుమతమ్మ. చేతులూ, కాళ్లూ బార్లా చాపేసి నిటారుగా పడుకుండిపోయాడు రామనాథయ్య నిలువు గుడ్లతో చూస్తూ. కిష్టయ్య గాబరాగా డాక్టరు కోసం పరుగెత్తాడు.

★★★

శిలాప్రతిమలా కూర్చుండిపోయింది భానుమతమ్మ, అనుకోని పరిణామానికి తట్టుకోలేక. ఢిల్లీలో వున్న కొడుకు, అమెరికాలో వున్న కూతురు, హైదరాబాదులో గడపవలసిన జీవితం - తమ ఆలోచనల మేరకు కల్పించుకున్న ఆశలు పట్టు తప్పిన

గాలిపటాల్లై యీ క్షణానికి పనికిరాకపోగా, ముక్కలైపోయిన మనసుతో యీ పనికిరాని పల్లెటూరు, మడ్డి మనిషి కిష్టయ్యా, ఒంటరితనం, నిస్సహాయత అన్న కఠిన సత్యాల్ని ఎదుర్కోలేక కలలోని మనిషిలాగా కూర్చుండిపోయింది మూఢురాలై.

ఢిల్లీ నుండి కొడుకు యీ పల్లె చేరటానికి రెండు రోజులు పడుతుంది గనక, ఎండాకాలం యీ మారుమూల పల్లెలో శవాన్ని నిలపటం కష్టం గనుక, అంత గొప్పగా బ్రతికిన మనిషిని సంస్కారం లేకుండా రాత్రికి నిలిపి, పాచి శవం చెయ్యరాదన్న బంధువుల నిర్ణయం మేరకు కృష్ణమూర్తి రామనాథం శవానికి అంత్యక్రియలు నిర్వర్తించాడు.

"ఈ పని చెయ్యడానికే నన్ను యిప్పుడు యిక్కడకు రప్పించావా స్వామీ!" అనుకున్నాడు కృష్ణమూర్తి కళ్లు ఒత్తుకుంటూ, దైవ నిర్ణయానికి దుఃఖిస్తూ.

★★★